క్లుప్తంగా

21న షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం



మాట్లాడుతున్న పత్తికొండ డీఎల్‌పీఓ

ఆలూరు: నియోజకవర్గ కేంద్రం ఆలూరులోని వారపు కూరగాయాల సంత మార్కెట్ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు ఈ నెల 21వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రయ్య తెలిపారు. మంగళవారం ఆలూరులో పర్యటించారు. తాగునీటి వనరులు, డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన 28 దుకాణాలకు ఈ నెల 21న నిర్వహించే వేలం పాటలో రిజర్వేషన్లు పాటిస్తామని తెలిపారు. అయితే ఆలూరు గ్రామానికి చెందిన వారు మాత్రమే పాల్గొనాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఈఓఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హాలహర్వి: మండలంలోని అర్ధగేరి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శ్రీవల్లి, హేమంత్‌రాజ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఇటీవల అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో తిరుపతిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. తమ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆలూరు రూరల్: గుట్టుగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25,445 స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం రాత్రి మండలంలోని మూసానహళ్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, 3 స్కూటర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో 5 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ మృతి



వీరభద్రప్ప (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ వీరభద్రప్ప(41) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరభద్రప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఇదిలా ఉండగా ఇదే గ్రామానికి చెందిన చిన్న కేశవులు(49) కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. వంద కుటుంబాలు కూడా లేని ఈ చిన్న గ్రామంలో ఒకే రోజు ఇద్దరు మృతిచెందడం, అందులో కుటుంబ పెద్దలు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): కర్నూలు కోల్స్ కాలేజీ మైదానంలో ఈ నెల 18న జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం వెల్దుర్తి కొత్త బస్టాండ్ వద్ద మండల అధ్యక్షుడు నాయకంటి దేవరాజుతో కలిసి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పసుల దేవదానం, ఎర్ర బజారు, నాయకంటి గిడ్డయ్య, ఐజయ్య పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

కౌతాళం: గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు, భూతగాదాలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. మంగళవారం ఉరుకుంద గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభ విన్నివిస్తే.. రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు. సమావేశంలో తహసీల్దారు మల్లికార్జునస్వామి, డిప్యూటీ తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

అపార్‌కు ఆధార్ గ్రహణం

- అక్షరం తప్పున్నా నమోదుకు ఆటంకం
- వివరాలు సరిచేస్తేనే ప్రక్రియ వేగవంతం
- ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మద్దికెర: దేశవ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు ఆటంకాలు ఎదరవుతున్నాయి. ఆధార్‌కార్డులో ఉన్న సమాచారం మేరకే అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆధార్‌లో తప్పులతడకగా ఉండడంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లో తప్పులు సరిచేసి ఆ తరువాత అపార్‌లో నమోదు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో పాఠశాలలో 55 శాతం కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అపార్ జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా విద్యార్థికి సంబంధించిన పూర్తి స్థాయి సమాచారం నమోదై ఉంటుంది. దేశంలో ఎక్కడైనా చదవాలన్నా, ఉపాధి అవకాశాలకు ఈ శాశ్వత డిజిటల్ కార్డు సంఖ్య కీలకం కానుంది. ముఖ్యంగా ధ్రువపత్రాల రక్షణకు అవకాశం ఉంటుంది. అయితే విద్యార్థుల ఆధార్ వివరాల్లోని తప్పులతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పేర్లలో తప్పులు.. తప్పని ఇబ్బందులు

ఆధార్ ఒక విధంగా, పాఠశాలలో మరో విధంగా పేర్లు ఉండడంతో వాటిని మార్చడం సమస్యగా మారింది. చాలా మందికి ఆధార్ జారీ సమయంలో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. నెల, తేదీ నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. పాఠశాల, ఆధార్‌లోని వివరాలు సరిపోలినపుడే అపార్‌లో నమోదు అవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబర్, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్యలో ఏదైనా తప్పుగా చూపినా నమోదు కావడం లేదు. పేరులో సైతం అక్షరాలు సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్‌లో నమోదుకు ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది. పాఠశాల రికార్డులో నమోదైన సమాచారానికి ఆధార్ వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, మొబైల్ నంబర్ పరంగా ఎక్కువగా తప్పులు దొర్లుతున్నాయి. చిరునామా సైతం ఆధార్‌కు, పాఠశాలలోని రికార్డుల్లోని చిరునామా సరిపోకపోవడంతో ప్రక్రియ సజావుగా సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరిచేయడానికి సరైన సమాచారం ఇవ్వకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆధార్ నమోదుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

నియోజకవర్గంలో విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
1. మద్దికెర	26	3038
2. తుగ్గలి	66	7127
3. పత్తికొండ	46	8600
4. కృష్ణగిరి	47	6581
5. వెల్దుర్తి	61	8492

వేగవంతంగా అపార్ నమోదు



కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియ ఆయా పాఠశాలల్లో వేగవంతంగా జరుగుతోంది. 1 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేస్తున్నాం. భవిష్యత్తులో ఎన్నో రకాలుగా ఉపయోగపడే అపార్ కార్డు జారీలో కొన్ని అవాంతరాలు ఏర్పడినా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–రంగస్వామి, ఎంఈఓ, మద్దికెర

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఆధార్‌లో పుట్టిన తేదీ సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి ఇచ్చే ధ్రువీకరణ పత్రం కీలకం. గ్రామాల్లో 80 శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయించడం లేదు. రెవెన్యూశాఖ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే అపార్‌లో నమోదుకు అవకాశం ఉంటుంది. నవంబర్ 30లోగా అపార్ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం అపార్ కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు, ఆధార్‌కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆధార్ సమస్యతో అపార్ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిల్లల పేర్లు తప్పుగా నమోదయ్యాయి



మా అబ్బాయి పదో తరగతి చదువుతున్నాడు. అయితే స్కూలులో ఒకలా ఆధార్‌కార్డులో మరోలా పేరు ఉండడంతో సరిచేయించుకోడానికి ఆధార్ కేంద్రాని వచ్చాం. త్వరగా పూర్తయితే బాగుంటుంది.

–రంగస్వామి, మద్దికెర

ఆధార్‌లో పేరు తప్పుగా వచ్చింది



మా పిల్లల ఆధార్ కార్డులో పేర్లు తప్పుగా ఉండడంతో మార్పించుకోడానికి ఆధార్ కేంద్రానికి వచ్చాం. పనులు వదులుకుని రావాల్సి వచ్చింది. ఆధార్ నమోదు చేసేటప్పుడే సక్రమంగా చేసి ఉంటే ఈ బాధలు ఉండేవి కాదు. –కోదండరాముడు, మద్దికెర

తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయొద్దు

హొళగుంద: పిల్లల భవిష్యత్తు బాగుండాలని ఎన్నో కష్టాలు అనుభవించి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేయొద్దని హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువు ప్రాధాన్యత గురించి ఎస్‌ఐ విద్యార్థినులకు వివరించారు. చదువులో రాణించి గురువులు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఏకగ్రతతో ఇష్టపడి చదివితే విద్యలో బాగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. చదువులో బాగా రాణించిన మేఘన, సంగీత, మనిషాలకు బహుమతులను అందజేశారు.



కేజీబీవీ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ బాలనరసింహులు

పంటలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని సిరుగాపురం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన జొన్న పంటకు రూ.297 ఎకరాకు, శనగ పంటకు రూ.420 ఎకరాకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంటలు దెబ్బతింటే రైతులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రతి రైతు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. పంటలకు చీడపీడలు సోకకుండా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సమక్షంలో పురుగు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈఓ శ్రీకాంత్, ఎంపీఈఓ రవిశేఖర్ పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ఆస్పరి: రబీ సీజన్‌లో వేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకిం కింద రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పరిలో ఆయన మాట్లాడుతూ.. రబీలో పంటలకు రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు వారే ప్రీమియం చెల్లిస్తారని, రుణాలు తీసుకోని రైతులు పప్పు శనగ పంటకు ఎకరాకు రూ.420, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ. 297, ఉల్లికి రూ.1350, టమాట రూ. 1500 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియంను కామన్ సర్వీసు సెంటర్లలో చెల్లించాలని తెలిపారు. పప్పుశనగ, వేరుశనగ, జొన్న, ఉల్లి పంటలకు దిగుబడి ఆధారంగా నష్టం అంచనా వేస్తామని, టమాటాకు మాత్రం వాతావరణం ఆధారంగా నష్ట అంచనా వేస్తామని చెప్పారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

రబీ సీజన్‌లో వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు మీసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ తెలిపారు. కే6 వేరుశనగ రకం పూర్తి ధర క్వింటా రూ.9600 కాగా సబ్సిడీ రూ. 3840 పోగా రైతులు రూ.5760 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పంచాయతీ స్థలం కబ్జాపై ఫిర్యాదు

మద్దికెర: స్థానిక పశువుల వైద్యశాల సమీపంలోని పంచాయతీ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని కాలనీవాసులు మంగళవారం పంచాయతీ ఈఓ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్న దారిని ఆక్రమించి బండలు పాతుతున్నారని తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఈఓ పేర్కొన్నారు.



పంచాయతీ స్థలంలో పాతిన బండలు

కనకదాసు ఆశ్రమానికి స్థలం మంజూరుకు వినతి

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని 373 సర్వే నంబరులో కురువ సంఘం అనుభవంలో కలిగి ఉన్న 0.30 సెంట్ల స్థలాన్ని సంఘానికి కేటాయించి అన్ని హక్కులు కల్పించాలని ఆ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. మాదాసి, మాదారి కురువ సంఘం తాలూకా కార్యదర్శి పెద్యాట మల్లయ్య, మండలాధ్యక్షుడు పంపాపతి, నాయకులు గాదిలింగ, సోమన్న, రామన్న, రాము తదితరులు తహసీల్దార్‌తో మాట్లాడారు. ఆ స్థలంలో కురువ కులస్తుల ఆరాధ్య దేవుడు కనకదాసు పేరిట ఆశ్రమం ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడానికి కేటాయించాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కురువ సంఘం నాయకులు

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

హాలహర్వి: స్థానికంగా పనులు లేవని ఎవరూ వలస వెళ్లవద్దని, పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హాలహర్విలోని దుర్గమ్మవ్వ ఆలయ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో పాల్గొనే వారికి రోజుకు రూ.300 గిట్టుబాటు వేతనం అందుతుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లవద్దన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏపీఓ చక్రవర్తి, సర్పంచ్ మల్లికార్జున, వాటర్‌షెడ్ ఆఫీసర్ గోవింద, అర్ధగేరి సర్పంచ్ గురుదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ(తుగ్గలి): ఎన్నికల సమయంలో చంద్రబాబు ఏ విధంగా సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారో.. అదే తరహాలో బడ్జెట్‌లోనూ బురిడీ కొట్టించారని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. భవిష్యత్తు గ్యారెంటీ అంటూ ఇంటింటికీ వెళ్లి మోసపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక లేనిపోని కథలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఉద్యోగాల ఊసేలేదు, నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ.3వేలు అన్నారు ఏదీ అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొని..బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి అన్నదాతలను దగా చేశారని మండిపడ్డారు. ఎంత మంది పిల్లలు బడికెళితే అంతమందికి తల్లికి వందనం అన్ని చెప్పి ఇప్పుడు సగానికి పైగా కోతలు పెట్టడం అన్యాయం కాదా అన్నారు. కూటమి సర్కార్ ఏర్పడి ఐదు నెలలు గడిచినా ఇంత వరకు ఉచిత బస్సు ఏదీ అని నిలదీశారు. మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఆ పథకానికి నిధులు ఇవ్వకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. హామీల అమలుపై ప్రజలను ప్రశ్నిస్తారనే సోషల్ మీడియాపై, వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తూ చంద్రబాబు సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలతో కలిసి రోడ్లపై వచ్చి పోరాడుతామని చెప్పారు. కరోనా కష్ట కాలంలోనూ జగనన్న ప్రభుత్వం 99 శాతం హామీలు నెరవేర్చిందని చెప్పారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఐదు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను ప్రజలు తలుచుకుంటున్నారన్నారు. చంద్రబాబు, కూటమి నేతలు ఇచ్చిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను ఇప్పుడు ఏం చేసుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని, దీనికి ఎవరు సమాధానం చెబుతారో ప్రజలకు చెప్పాలన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మారెమ్మ.. చల్లంగా చూడమ్మా



పూజలందుకున్న మారెమ్మ

కృష్ణగిరి: మండలంలోని అమ్మవారి దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మ, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు.

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు

పత్తికొండ(తుగ్గలి): డివిజన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ డాక్టర్ ఎస్ భరత్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్లు, మైనర్ ఇరిగేషన్ అధికారులకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ట్రైనర్లు రియాజ్, రంగడు శిక్షణ ఇచ్చారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీ పరిధిలో నిర్వహించే సంఘాల్లో రైతుల ఓటర్ల జాబితా పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈనెల 20 నుంచి ఎన్నికల నిర్వహణ ఉంటుందని, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

సారా విక్రేత అరెస్ట్

తుగ్గలి: మండల పరిధిలోని ఎల్లమ్మగుట్ట తండా వద్ద మంగళవారం తండాకు చెందిన రూప్లానాయక్ బైక్‌పై నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు జొన్నగిరి ఎస్‌ఐ జయశేఖర్ తెలిపారు. అతని వద్ద నుంచి 10లీటర్ల నాటు సారా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

టీబీ డ్యాం ఉద్యోగుల ఆందోళన



టీబీ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీకి సమస్యలను వివరిస్తున్న యూనియన్ నాయకులు



ఆందోళనలో పాల్గొన్న ఏపీ, కర్ణాటక లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు

హొళగుంద: ప్రతి నెలా సమయానికి వేతనాలు, ఇతర టీఏ, డీఏ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చింతకుంట 133 కి.మీ నుంచి ఆంధ్ర కాలువ ప్రారంభం (హన్వాళ్ సెక్షన్) 250 కి.మీ పరిధిలో వచ్చే లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పెన్షనర్లు, ఇతర సిబ్బంది ఆందోళనకు దిగారు. టీబీబీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టీకే గోపాల్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కొన్నేళ్లుగా జీతాలు సక్రమంగా అందడం లేదన్నారు. రెండేళ్లుగా టీఏ, డీఏ ఇవ్వడం లేదని తెలిపారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం టీబీ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీకి తమ సమస్యలను వివరించారు. తాము ఆందోళన బాట పట్టినా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని తెలిపారు.

జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపిక

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్. హేమంత్‌కుమార్ జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపికైనట్లు వార్డెన్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో హేమంత్‌కుమార్ రాణించడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అక్కడ కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హేమంత్‌కుమార్‌ను పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీఈటీ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



హేమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న వార్డెన్ వెంకటేశ్వర్లు